'సార్ మాకు ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు.. ఇచ్చేదే చాలీచాలని జీతాలు.. అవి కూడా ఇంత కాలం ఇవ్వకుంటే మా కుటుంబం ఎలా గడవాలి.. వెంటనే వాటిని ఇప్పించండి' అంటూ జిల్లాలోని 844 గ్రామ పంచాయతీ కార్మికులు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పంచాయతీ అధికారులకు వినతి పత్రం అందజేసి వేడుకున్నారు.

మరో వైపు ప్రజలు కూడా 'అయ్యా వానకాలం సీజన్ వచ్చింది.. ఊళ్లో ట్రాక్టర్లు కరాబ్ అయ్యాయట.. పంచాయతీ వర్కర్లకు జీతాలు ఇవ్వట్లేదట.. ఇండ్లల్లో ఉన్న చెత్తను ఇంటి బయట వేశాము.. ఆ చెత్తను తీసే మానవుడే లేకుండా పోయాడు.. ఈగలు, దోమలతో విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉంది.. దయచేసి మా ఇండ్ల ముందు ఉన్న చెత్తను ఎత్తించండి' అని పంచాయతీ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి మొరపెట్టుకున్నారు.

# పంచాయతీల్లో పడకేసిన పాలన

## కార్మికులకు వేతనాల్లేవ్.. అస్తవ్యస్తంగా పారిశుధ్యం

- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ
- ఏడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కార్మికుల వేడుకోలు
- సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని జనం వినతి

నల్లగొండ, జూలై 4 : కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాలతో గురువారం జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయిలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రతి గ్రామం నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ప్రధానమైనవి ఇవి. కొందరు తమ వ్యక్తిగత సమస్యల గురించి దరఖాస్తులు చేసుకోగా, ప్రతి గ్రామం నుంచి వచ్చిన దరఖాస్తులు మాత్రం ఇవే. గత డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వకపోవడంతో పల్లెల్లో సమస్యలు పేరుకుపోయాయి. ప్రధానంగా పారిశుధ్య సమస్య తీవ్రం కావడంతో దాన్ని పరిష్కరించాలని కోరుతూ ప్రజలు దరఖాస్తులు అందచేశారు. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యలు ఇప్పుడు పరిష్కారమవుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.



నల్లగొండ మండలం దండంపల్లిలో పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

### పంచాయతీ కార్మికులకు కష్టాలు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019 సెప్టెంబర్ నుంచి పల్లె ప్రగతిని అమలు చేసి గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది. మొక్కల నాటింపు మొదలు, వైకుంఠ ధామం వరకు ప్రతి అవసరాన్ని గుర్తించి ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే పారిశుధ్యాన్ని సీరియస్‌గా తీసుకున్న సర్కార్ ప్రతి గ్రామంలో ఇద్దరు నుంచి ఐదుగురు వరకు పంచాయతీల్లో కార్మికులను నియమించింది. వారికి అప్పట్లో నెలకు రూ.1500 ఉన్న వేతనాన్ని రూ.8,500కు, ఆ తర్వాత రూ.9వేలకు పెంచారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలో 1,250 మంది కార్మికులు ఉండగా వారికి ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పంచాయతీలకు నెలకు రూ.19.50 కోట్లు ఇవ్వడంతో కార్మికులు సకాలంలో వేతనాలు తీసుకొని పనిచేసేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఈ ఏడు నెలల్లో కార్మికులకు ఒక్క రూపాయి కూడా వేతనం ఇవ్వకపోవటంతో వారి కుటుంబాలకు పూట గడువడమే ఇబ్బందిగా మారింది. ఉపాధి పనులకు పోవాల్సిన పరిస్థితి దాపురించింది. పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని ప్రతి గ్రామంలో గురువారం జరిగిన ప్రజావాణిలో దరఖాస్తులు అందచేశారు.

### పారిశుధ్య సమస్యను పరిష్కరించండి..

వానకాలం సీజన్ మొదలైనందున పారిశుధ్య సమస్యలు తీవ్రమయ్యాయని, వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో గురువారం జరిగిన ప్రజావాణిలో గ్రామాల నుంచి ఫిర్యాదులు అందాయి. బయట వేసిన చెత్త తీయమంటే కొందరు తమకు జీతాలే ఇవ్వడం లేదు.. పని ఎట్లా చేయాలని.. ట్రాక్టర్లు రిపేర్‌కు వచ్చాయని, డీజిల్‌కు డబ్బులు లేవని అంటున్నారని పేర్కొంటూ ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తులు చేశారు. వ్యాధుల బారిన పడకముందే పల్లెలన్నీ శుభ్రం చేయాలని అధికారులను కోరారు.

### పెట్టుబడి పెట్టలేక చేతులెత్తేసిన కార్యదర్శులు


గ్రామ పంచాయతీల గల్ల ఖాళీ కావటంతో ఇప్పటివరకు అత్యవసర పనులకు కొంత మేర పెట్టుబడి పెట్టిన పంచాయతీ కార్యర్శులు ఇక తమవల్ల కాదని చేతులెత్తేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న సర్పంచుల పదవీ కాలం పూర్తి కాగా పంచాయతీలో ఉన్న నిధులన్నీ వారు డ్రా చేసుకొని వెళ్లిపోయారు. అప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులే ఖర్చులను సొంతంగా వెచ్చించాల్సి వస్తున్నది. ట్రాక్టర్ల ఈఎమ్ఐలు, బోరు మోటర్ల మరమ్మతులు, వీధి లైట్ల ఏర్పాటు వంటివి చేయాల్సి వస్తున్నది. నిధుల లేమితో పల్లెల్లో పారిశుధ్యం పడకేయగా మిషన్ భగీరథ నీరు మినహాయిస్తే వాడకం నీరు రాని గ్రామాల్లో జిల్లాలో ఎన్నో ఉన్నాయి. రెండు మూడు నెలల వరకు ఖర్చు పెట్టిన కార్యదర్శులు ఇటీవల చేతులెత్తేయడంతో గ్రామాల్లో ట్రాక్టర్లు గ్రామ పంచాయతీలకే పరిమితమయ్యాయి. వేతనాలు లేవని జీపీ కార్మికులు ఉపాధి పనులకు వెళ్తున్నారు. వీధుల్లో లైట్లు వెలగడం లేదు. మరోవైపు తమకు రావాల్సిన పెండింగ్ నిధుల కోసం మాజీ సర్పంచులు ఎదురు చూస్తున్నారు.

# ఐదేండ్ల పదవీ కాలం సంతృప్తినిచ్చింది

## సమన్వయంతో పారదర్శకతకు పెద్దపీట

- ఉద్యమకారుడిగా నన్ను గుర్తించి కేసీఆర్ అవకాశమిచ్చారు
- రూ.47.86 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- విద్యా, వైద్యరంగాలకు ప్రాధాన్యం
- నిరుద్యోగుల కోసం అత్యాధునిక స్టడీహాల్
- 254 మంది పదోన్నతులు... 120 మందికి కారుణ్య నియామకాలు
- జడ్పీలో ఆదాయం పెంపునకు కృషి
- సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- 'నమస్తే తెలంగాణ'తో నల్లగొండ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

ఇంటర్వ్యూ Interview



నల్లగొండ ప్రతినిధి, జూలై 4 (నమస్తే తెలంగాణ) : 'తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అధినేత కేసీఆర్ వెంట అడుగులో అడుగేసిన నాకు మంచి గుర్తింపే దక్కింది. రాష్ట్రం వచ్చాక అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా.. ఆ తర్వాత నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్‌గా కేసీఆర్ ఆశీర్వాదం ఎన్నడూ మరువలేనిది. అలాంటి పదవికి న్యాయం చేసేందుకు వందశాతం కృషి చేశా. జిల్లా ప్రజాప్రతినిధుల, జడ్పీ పాలకవర్గం సభ్యుల సహకారంతో రాజకీయాలకు అతీతంగా జిల్లా పరిషత్ పాలనను సజావుగానే సాగించానని అనుకుంటున్నా. జిల్లా అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ శాఖల వారీగా సమీక్ష చేస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేశాం. ఇక జడ్పీకి వచ్చిన నిధులను అందరి సభ్యులకు కేటాయిస్తూనే విద్యావైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ఖర్చు చేశాం. రూ.47.86కోట్లలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. ఇవి కాకుండా నిరుద్యోగులకు అత్యాధునిక వసతులతో స్టడీహాల్, పాఠశాలల్లో లైబ్రరీలకు బుక్స్, గుంటిపల్లిలో మోడల్ పల్లె పకృతి వనం, జీవవైవిధ్య కమిటీ ద్వారా పర్యావరణహిత కార్యక్రమాలు, వాటికి అవార్డు, సిబ్బందికి సకాలంలో పదోన్నతులు, అర్హులైన వారికి కారుణ్యనియామకాలు ఇలా అనేక కార్యక్రమాలతో సాగిన ఈ ఐదేండ్ల జడ్పీ చైర్మన్ పదవీ కాలం సంతృప్తినిచ్చింది' అని బండ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జడ్పీ పాలకవర్గం పదవీకాలం గురువారంతో ముగుస్తుండడంతో 'నమస్తే తెలంగాణ'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

'2019 జూన్ 8న ఏకగ్రీవంగా జడ్పీ చైర్మన్‌గా ఎన్నికైనా జూలై 4న బాధ్యతలు చేపట్టాను. నార్కట్‌పల్లి మండల ప్రజల ఆదరణతో జడ్పీటీసీగా గెలువగా కేసీఆర్ ఆశీర్వాదంతో అప్పటి జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యుల సహకారంతో జడ్పీ చైర్మన్‌గా అవకాశం లభించింది. ఈ ఐదేండ్ల పాలనలోనూ అందరి సహకారంతో జడ్పీ పాలకవర్గాన్ని సజావుగా ముందుకు సాగించాను. జడ్పీ చైర్మన్‌గా పార్టీలకు అతీతంగా సభ్యుల సహకారం మరువలేనిది. అందరికీ నిధులు కేటాయించాను. ఒక్కో సభ్యునికి సగటున కోటి రూపాయల చొప్పున నిధులు కేటాయించాం. మొత్తం రూ.47.86 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. వీటిల్లో విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యమిస్తూ ఖర్చు చేశాం. పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు వైద్యారోగ్య కేంద్రాల్లో మరమ్మతులకు ఎక్కువ నిధులు వెచ్చించాం. పాఠశాలల్లో లైబ్రరీలకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను అందజేశాం. నిడమనూరు మండలం గుంటిపల్లిలో పల్లె ప్రకృతి వనాన్ని జడ్పీ నుంచి మోడల్‌గా తీర్చిదిద్దాం. మహిళా ప్రాంగణంలోనూ మూడెకరాల్లో పండ్లు, పూల తోటల పెంపకాన్ని చేపట్టాం. నిరుద్యోగుల కోసం ప్రత్యేకంగా అన్ని వసతులతో స్టడీ హాల్‌ను ఏర్పాటు చేస్తే అందులో నుంచి 30 మందికి పైగా ఉద్యోగాలు సాధించడం సంతృప్తినిచ్చింది. జడ్పీ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమ విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ వహించాం. మొత్తం 560 మంది జడ్పీ పరిధిలో విధులు నిర్వర్తిస్తుండగా అందులో 254 మందికి పదోన్నతులు కల్పించాం. అర్హులైన మరో 120 మందికి కారుణ్య నియామకాలు చేపట్టాం. ఉద్యోగుల బదీల్లో సైతం పారదర్శకంగా వ్యవహరిస్తూ వారి మనోభావాలకు పెద్దపీట వేశాం. జడ్పీ ఆదాయం పెంపుపైనా దృష్టి సారించి పాత భవనాన్ని ఫ్యామిలీ కోర్టు, ఫోక్సో కోర్టులకు, ఆడిట్ విభాగానికి అద్దెకు ఇచ్చాం. జడ్పీ గెస్ట్‌హౌస్‌తో పాటు ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని సైతం లీజుకు ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా చేశాం. నూతన జడ్పీ భవనంలో అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దాం. ఈ ఐదేండ్లల్లో అందరి సమన్వయం, సహకారంతో శక్తివంచన లేకుండా జిల్లా పరిషత్ ద్వారా పాలన కొనసాగించేందుకు కృషి చేశాం. ఇందులో సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు' అని తెలిపారు.

### నార్కట్‌పల్లి ప్రజలకు రుణపడి ఉంటా

'నార్కట్‌పల్లి మండల ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా. జడ్పీటీసీ ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు ఉత్కంఠ పోరులో నన్ను ఆదరించి గెలిపించడంతోనే జడ్పీ చైర్మన్‌ను కాగలిగాను. జడ్పీ చైర్మన్‌గా పనిచేస్తున్నా మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉన్నా. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు, ఇండ్ల మీద నుంచి వెళ్లే కరెంట్ లైన్ల తొలగింపు వంటి అభివృద్ధి పనులు పూర్తి చేశా. భవిష్యత్‌లోనూ మండల అభివృద్ధి కోసం నా తపన కొనసాగుతుంది. ఇక ముందు కూడా నార్కట్‌పల్లి ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటా' అని బండ నరేందర్‌రెడ్డి చెప్పారు.

### కీలకమైన కొన్ని కార్యక్రమాలు

- జనరల్ ఫండ్, ఎస్ఎఫ్‌సీ, స్పెషల్ గ్రాంట్, 15వ ఫైనాన్స్ నిధుల నుంచి రూ.47.86కోట్లతో అభివృద్ధి పనులు
- జనాభా ప్రతిపాదికన కొంచె ఎక్కువతక్కువలు ఉన్నా సగటున ఒక్కో సభ్యుడి ద్వారా కోటి రూపాయల వ్యయం
- 216 పాఠశాలల్లో రూ.2.70కోట్లతో టాయిలెట్ల మరమ్మతులు, సైన్స్ ల్యాబులకు పరికరాల సరఫరా
- పాఠశాలల లైబ్రరీలకు ముగ్గురు విద్యార్థులకు ఒకటి చొప్పున ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల పంపిణీ
- 'మన ఊరు-మన బడి'లో భాగంగా జడ్పీ నిధులతో మౌలిక వసతుల కల్పన
- నల్లగొండలో జిల్లా పంచాయతీ రీసోర్స్ పర్సన్ బిల్డింగ్‌ను అత్యాధునిక స్టడీ సెంటర్‌గా మార్పు. ఉచిత భోజనంతో పాటు వసతుల కల్పన. స్టడీహాల్ ద్వారా 30 మందికి పైగా ఉద్యోగాల సాధన
- రూ.4.30 కోట్లతో తిరుమలగిరిసాగర్, నేరేడుగొమ్ము, గట్టుప్పల్ పీహెచ్‌సీల నిర్మాణం
- రూ.4కోట్లతో కనగల్, గుడిపల్లి, నిడమనూరు, పెద్దవూర, కట్టంగూరు, చండూరు పీహెచ్‌సీల భవనాలకు మరమ్మతులు
- నూతన జడ్పీ భవనంలో పాలనకు అనుగుణంగా అత్యాధునిక వసతుల కల్పన. అహ్లాదకర వాతావరణం
- పాత జడ్పీ భవనాల అద్దె, స్థలాల లీజు ద్వారా ప్రతియేటా పది లక్షల ఆదాయ వనరుల సృష్టి
- జీవవైవిధ్య కమిటీ ద్వారా పలు పర్యావరణ కార్యక్రమాలు. వీటికి గుర్తింపుగా అవార్డు సాధన
- 120 మందికి జూనియర్ అసిసెంట్లుగా, టైపిస్టులుగా, ఆఫీసు సబార్డినేటర్లుగా కారుణ్య నియమాకాల ఉత్వర్వులు
- 254 మందికి పదోన్నతులు. 61 మందికి సూపరింటెండెంట్లుగా, 106 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా, 24 మందికి జూనియర్ అసిసెంట్లుగా, 11మందికి టైపిస్టులుగా, 52 మందికి రికార్డు అసిసెంట్లుగా పదోన్నతులు
- మహిళా ప్రాంగణం ఆవరణలో మూడెకరాల్లో పండ్లు, పూల తోటల అభివృద్ధి
- నిడమనూరు మండలం గుంటిపల్లిలో మోడల్ మెగా పల్లె ప్రకృతి వనం ఏర్పాటు
- ఎంజీ యూనివర్సిటీలో జడ్పీ నుంచి ప్రత్యేకంగా మొక్కల పెంపకం.





హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

# అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడేది లేదు

- అధికారులు అవకతవకలకు పాల్పడితే ఇంటికే..
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, జూలై 4 : అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీపడేది లేదని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. రామస్వామి గుట్ట వద్ద క్రైస్తవుల కోసం కోటి రూపాయలతో నిర్మిస్తున్న శ్మశాన వాటిక , ఎన్‌ఎస్పీ క్యాంప్‌లో నిర్మించనున్న మినీ స్టేడియం స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం హుజూర్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మేళ్లచెర్వు, నేరేడుచర్ల, పాలకవీడు, కోదాడలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవినీతికి తావులేకుండా అధికారులు కార్యకలాపాలు సాగించాలని తెలిపారు. హుజూర్‌నగర్‌లో ప్రధాన రహదారి, రింగ్ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. రానున్న నాలుగు నెలల్లో రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన 2,160 సింగిల్ బెడ్రూం ఇండ్లను పేదలకు పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా న్యాక్ శిక్షణ శిబిరం ద్వారా 30 మంది పేద మహిళలకు రూ.2.10 లక్షల విలువ గల కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ నాగార్జునరెడ్డి , కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనారవి, వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

# డిగ్రీ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

నల్లగొండ, జూలై 4 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూడు డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని బీసీ గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి షకినా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగార్జునసాగర్ పురుషుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట మహిళా డిగ్రీ కళాశాల, యాదాద్రి భువనగిరి పురుషుల డిగ్రీ కళాశాలలలో బీఏ, బీకాం, బీఎస్సీ విభాగాల్లో ఈ నెల 4 నుంచి 8వరకు ఆయా కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ పురుషుల డిగ్రీ కళాశాలకు సంబంధించి(హిల్ కాలనీ, నాగార్జున సాగర్) 9490570303, సూర్యాపేట మహిళా డిగ్రీ కళాశాల (మద్దిరాల బాలికల పాఠశాల, రాకేశ్, బీఎడ్ కళాశాల, భగత్‌సింగ్ నగర్, న్యూ మార్కెట్ రోడ్, సూర్యాపేట) 9154102591, యాదాద్రి భువనగిరి పురుషుల డిగ్రీ కళాశాలల (ఎస్ఓఈ బాలురు అనంతారం, శారద ఇంజినీరింగ్ కళాశాల 9133982902, 9505110024, 9440420159 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

# 57 ఏండ్ల వారికి నో పెన్షన్

- 65 ఏండ్లు నిండితేనే దరఖాస్తులు

దామరచర్ల, జూలై 4 : గత ప్రభుత్వం 57 ఏండ్లు నిండిన వారికి ఆసరా పింఛన్లు ఇవ్వగా కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రద్దు చేసింది. 65 ఏండ్లు నిండిన వారే వృద్ధాప్య పెన్షన్‌కు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గత ప్రభుత్వంలో 57 ఏండ్లు నిండిన వారు నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా పెన్షన్‌ను మంజూరు చేశారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న ప్రజావాణిలో అధికంగా పెన్షన్ల కోసమే దరఖాస్తు చేసుకోవడానికి వస్తున్నారు. 57 ఏండ్ల వారికి ఆన్‌లైన్ దరఖాస్తులో ఆప్షన్ లేదని అధికారులు తేల్చిచెప్పేస్తున్నారు. దాంతో దరఖాస్తు దారులు నిరుత్సాహంతో వెనుతిరుగుతున్నారు. ఇదేమిటనీ అధికారులను అడిగితే తాము ఏమీ చేయలేమని చెబుతున్నారు.

# ఎప్‌సెట్ కౌన్సిలింగ్ ప్రారంభం

- 4 నుంచి 12 వరకు స్లాట్ బుకింగ్
- నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరిశీలన సెంటర్ ఏర్పాటు

రామగిరి, జూలై 4 : ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన తెలంగాణ ఇంజినీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈఏపీసెట్)-2024 ఎంపీసీ స్ట్రీమ్ అభ్యర్థుల కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 6 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన జరుగనుండగా అందుకు సంబంధించి ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ ప్రక్రియ మొదలైంది. నల్లగొండలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆన్‌లైన్ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న తర్వాతే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, స్లాట్ బుకింగ్ లేకుండా వస్తే సర్టిఫికెట్ల పరిశీలన చేయడం జరుగదని నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకి దేవి తెలిపారు.

### కౌన్సిలింగ్ షెడ్యూల్ ఇలా..

- కౌన్సిలింగ్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకునే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600, ఇతర విద్యార్థులు రూ.1200 ఫీజు చెల్లించాలి.
- ఈ నెల 6 నుంచి 13 వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేసుకునే అవకాశం ఉంది.
- ఈ నెల 8 నుంచి 15 వరకు కళాశాలలో ఎంపికకు వెబ్ ఆప్షన్.
- ఈ నెల 19న సీట్ అలాట్‌మెంట్
- తొలి విడుత సీటు వచ్చిన విద్యార్థులు ఈ నెల 19 నుంచి 23లోపు ఆయా కళాశాలలో ఫీజు చెల్లించి చేరాలి.
- రెండో విడుత కౌన్సిలింగ్ ఈ నెల 26 నుంచి ఆగస్టు 4 వరకు ఉంటుంది.

# బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా, జూలై 4 : బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లో గురువారం నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ నియోజకవర్గంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు భగత్ తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని తాను తెలిపినట్లు చెప్పారు.



# పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, జూలై 4 : పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించలేని దీనస్థితిలో ప్రభుత్వం ఉందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాలలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓ వైపు వర్షాలు ప్రారంభమై సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుంటే మరో వైపు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవటంతో పారిశుధ్య పరిస్థితి దారుణంగా మారిందని తెలిపారు. పంచాయతీల్లో మౌలిక వసతులు కరువయ్యాయని, బ్లీచింగ్ పౌడర్ కూడా సరపరా చేయని పరిస్థితి నెలకొన్నదని దుయ్యబట్టారు. వేతనాలు అందక పని ఒత్తిడితో పంచాయతీ కార్మికులు ఎంపీడీఓల వద్ద లాంగ్ లీవ్ కోసం దరఖాస్తులు పెట్టుకుంటున్నారని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ గ్రామాల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు అమలు చేశారని, కాంగ్రెస్ పాలనలో వాటి ఆలనాపాలన లేకుండా పోయిందని తెలిపారు. హరితహారం మొక్కలకు నీరు పోసే పరిస్థితి కూడ లేకుండా పోయిందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని, 7 నెలలు గడిచినా ప్రజా సమస్యలపై అవగాహనకు రాలేదని విమర్శించారు. పంచాయతీ సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించకపోతే ఆందోళనలు చేస్తామని, కలెక్టరేట్ ముట్టడిస్తామని చిరుమర్తి హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, నాయకులు గోధుమగడ్డ జలంధర్‌రెడ్డి, కోనేటి యల్లయ్య, కందాటి రమేశ్ రెడ్డి, ఆగు అశోక్, అరూరి స్వామి, బషీర్ పాల్గొన్నారు.

# విద్యతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

- హాస్టల్స్‌ను సద్వినియోగం చేసుకొని చదువుకోవాలి
- కలెక్టర్ నారాయణ రెడ్డి



నల్లగొండ ఆర్పీ రోడ్డులోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, జూలై 4 : ప్రభుత్వ హాస్టల్లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులు బాగా చదువుకొని సమాజంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డప్పుడే మంచి గుర్తింపు ఉంటుందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్పీ రోడ్‌లో, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయానికి ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల హాస్టల్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వంటగదిని, భోజనాన్ని, టాయిలెట్లు, డైనింగ్ హాల్, విద్యార్థినుల బ్యారక్‌లు పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థినిలతో కింద కూర్చొని ముఖాముఖి మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు.. ఏం చదువుతున్నారు.. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎన్ని మార్కులు వచ్చాయి.. పీజీ చదివే విద్యార్థులు అయితే డిగ్రీలో ఏం చదివారు? వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో గ్రామీణ ప్రాంతం, పేదరికం నుంచి వచ్చిన వారే ఎక్కువ ఉంటారని, విద్యార్థులు సైతం అదే రీతిన కష్ట కష్టపడి చదివి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దని, సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ తాను కూడా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదివానని, ఎన్నో కష్టాలను అధిగమించి టీచర్‌గా పని చేస్తూ, జిల్లా కలెక్టర్ స్థాయికి ఎదిగానని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ కోటేశ్వర్‌రావు, హాస్టల్ వార్డెన్లు రమ్య సుధా, సోమేశ్వరి తదితరులు ఉన్నారు.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

భువనగిరి అర్బన్, జూలై 4 : జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఆన్‌లైన్‌లో ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కె. నారాయణరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. http://nationala wardstoteachers. education.gov.in లో దరఖాస్తు చేయాలని, అందరు ఉపాధ్యాయులకు ఈ సమాచారం అందించడంతోపాటు కార్యాలయాల నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

# ఎంజీయూ జాబ్ మేళాకు విశేష స్పందన

- ఉమ్మడి జిల్లా నుంచి 400 మంది విద్యార్థుల హాజరు



విద్యార్థుల దరఖాస్తులను స్వీకరిస్తున్న ప్లేస్‌మెంట్ అధికారి ప్రశాంతి

రామగిరి, జూలై 4 : మహాత్మా గాంధీ యూనివర్సిటీలో యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఇమ్మార్టికల్స్ లెర్నింగ్ హైదరాబాద్ సహకారంతో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 400 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. జాబ్ మేళాను ఎంజీయూ ప్లేస్‌మెంట్ సెల్ అధికారిని వై.ప్రశాంతి, యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవితో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రశాంతి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో నైపుణ్యాలు ఉన్న విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంతో దేశంలో ప్రముఖ కంపెనీలను యూనివర్సిటీకి ఆహ్వానించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

ఐటీ, నాన్ ఐటీ రంగాల్లో అవకాశాలకు బీటెక్, ఎంసీఏ, బీఎస్సీ కంప్యూటర్స్ ఇతర డిగ్రీ అర్హతతో విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు. జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులకు ఆయా కంపెనీల నుంచి నియామక ఉత్తర్వులు త్వరలోనే అందుతాయని చెప్పారు. హాజరైన అభ్యర్థులకు రాత, మౌఖిక పరీక్ష నిర్వహించడంతోపాటు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు చేశారు. ఈ జాబేళాలో విప్రో, టీసీఎస్, జేపీ మోర్గాన్, మోర్గాన్ స్టాన్లీ, కేపీఎంజీ, గోల్డ్‌మెన్ సెర్చ్, హెచ్ఎస్‌బీసీ తదితర కంపెనీ ప్రతినిధులు రాగా ఎంజీయూ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.